# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మీ గంగా భవాని.

శ్రీమతి మాచిరాజు లక్ష్మీ గంగా భవానిగారు 98వ సంవత్సరము మే నెలలో అమెరికా రావడం తటస్థించింది. ఆ ప్రయాణములో వారి అనుభవాలు, వారు గమనించిన ఎన్నో విశేషాలు వారి మాటల్లోనే వినండి. భవాని గారు వ్రాసిన అనుభవాల్ని ఒకటి, రెండు చిన్న చిన్న మార్పులు మినహా, యథాతథంగా మీకు అందిస్తున్నాము. చదివేవారి సౌకర్యార్థం విషయాన్ని 3 పేరాగ్రాఫ్‌లుగా విభజించడం జరిగింది. ఇందులో విషయాలు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధముగా స్ఫురించవచ్చు. నిత్యం ఉదయిస్తున్న సూర్యు(భగవాను)ని చూసినపుడు ఒక్కొక్కరిది ఒక అనుభూతి. "ఒంటి చక్రపు రధము; అంటీ అంటని పథము; కుంటి సారధితోడ మింట పరుగిడునంట" అని ఒకరంటే "ఉదయించు భానుడు వంగపండు ఛాయ; వంగపండు మీద అద్దంపు పొడిఛాయ" అని మరొకరు వర్ణించారు. ఏది ఏమైన ముత్యాల ముగ్గులో రావుగోపాలరావుగారన్నట్లు (బాపు రమణీయం) "మనిషన్నాక కాస్తంత కళాపోషణ ఉండాలయ్య ..." అన్న మాటలు అక్షర సత్యాలు. ఈ రోజులలో సూర్యోదయము చూసేవాళ్ళే అరుదనుకోండి. అది వేరే విషయము. ఇక ప్రస్తుతానికి వద్దాం! మరి భవానిగారి అనుభవాలు విందామా! ||సం||

## శ్రీ గురుభ్యోనమ:

## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

శ్రీ సద్గురుదేవుల కృపతో, ఆరాధ్య దేవత అమ్మ అనుగ్రహంతో, ఆత్మీయుల అభిమాన ప్రోత్సాహాలతో, ధైర్యమే ప్రధానంగా, మా అమెరికా ప్రయాణం మొదలైంది. ఏ జన్మలోనో పెట్టి పుట్టిన పుణ్యం, సహకారి అయింది. ఉన్నంతకాలం నలుగురితో మంచిగా వుండాలి; ఆ నలుగురే పొలిమేరవరకు దిగబెట్టినట్టు, కుటుంబ సభ్యులు వారి శక్తి వంచనలేకుండా శ్రమించి, మమ్మల్ని మద్రాసు విమానాశ్రయానికి (ఎయిర్ పోర్ట్‌కి) చేర్చారు. అక్కడనుండి ఎవరి ప్రయత్నం వారు చేసుకోవలసిందే. యోగవాశిష్ఠంలో చెప్పినట్టు, ఎవరి ధర్మం, కర్మం వారితో పాటు వుండి ప్రయాణించినట్టు, భాష రాకపోయినా ముద్రాభావంతో, ఏ కార్యాన్నైనా సాధించవచ్చని విన్న పాఠం అనుభవంలోకి వచ్చింది. భాష రాని కారణంగా మోసగింపబడి 500 రూపాయలు నష్టపోకుండా, ధర్మమే కాపాడింది. లగేజి చెకింగ్‌లో గాని, ఇంకదేనికి గాని ఏవిధమైన తేడాలూ రాలేదు. పిల్లలు ఇంగ్లీషులో రాసి ఇచ్చిన పేపర్లు చూపించి కార్యం సానుకూలం చేసుకున్నాము. పదార్థాలు మంత్రంతో మార్చుచేసి, ఏలోకాలలోనో వున్న జీవుడికి అందించినట్టు, ప్రయాణంలో పనిచెయ్యని రూపాయల్ని అక్కడికి పనికొచ్చే డాలర్లుగా మార్చుకుని, అధైర్యపడకుండా ముద్రాభావాలతోనే అక్కడ పరిచయం అయిన వారితో పన్లు చేయించుకున్నాము.

మద్రాసు ఎయిర్ పోర్టులో మొదటిసారిగా మా సామాన్లు ట్రాలీల మీద పెట్టుకుని తోసుకుంటూ లోపలికి వెళ్ళాము. గేట్ దగ్గర పాస్ పోర్ట్ చూపించాకా లోపలికి పంపారు. ముందుగా లగేజి అంతా స్కేన్ చేసారు. లగేజి బెల్టు మీంచి తీసి ట్రాలీల మీద పెట్టుకుని, సింగపూర్ ఎయిర్‌లైన్స్ అని వున్న కౌంటర్ దగ్గరకి వెళ్ళాము. ఆ లోపుగానే ఇద్దరు అబ్బాయిలు లగేజి విషయంలో మమ్మల్ని మోసగించాలని చూసారు. "లగేజి ఎక్కువగా వుందని, ఫైన్ వేస్తారని, అదిమేం సర్దిపెడతాం, ఆఫీసరు మా ఫ్రెండ్, చెప్పి ఫైన్ వెయ్యకుండా చేస్తాము. 500 రూపాయలు ఇమ్మ"ని అడిగారు. "మా దగ్గర డబ్బులు ఇవ్వడానికి లేవు. లగేజి ఎందులో ఎక్కువ వుందో, చెప్పండి, తీసేసి అవతల మా వాళ్ళు వున్నారు, వాళ్ళకి ఇచ్చేస్తాము." అని చెప్పాము. వాళ్ళు అరవంలోను, ఇంగ్లీషులోనూ, మేం తెలుగులోనూ, వాదన పావుగంటపైన సాగింది. మేం ఒకే మాటమీద వున్నాం. వాళ్ళు 300 ఇమ్మని, 200 ఇమ్మని, అడిగి అడిగి, విసిగిపోయి, "వేస్ట్" అనుకుని వెళ్ళిపోయారు.

పిల్లలు చెప్పిన డైరెక్షన్‌లో, వాళ్ళు రాసి ఇచ్చిన ఇంగ్లీషు పేపర్లు, పాస్‌పోర్ట్, వీసా బుక్‌లు, టిక్కట్లు అన్నీ కౌంటర్‌లో ఇచ్చాము. ఇంగ్లీషు రాదు, తెలుగు మాత్రమే వచ్చు, అన్న పదాల్ని వాళ్ళకి ప్రత్యేకంగా రెండు మూడు సార్లు చూపించాము. అందులో తెలుగు మాట్లాడే వారిని పిలిచి ఏం చెయ్యాలో, మాకు చెప్పించారు. ఏ టిక్కట్లు లోపల వెనక్కి పెట్టుకోవాలో, ఏ టిక్కట్లు సింగపూర్‌లో చూపించాలో, ఏ టిక్కట్లు మద్రాసు విమానంలో ఇవ్వాలో, అన్నీ వివరంగా చెప్పి, అక్కడ ఎయిర్ పోర్ట్‌లో ఎక్కడ ఏంచెయ్యాలో చెప్పారు. అప్లికేషన్ ఫారం లాంటివి రెండు ఇచ్చి మమ్మల్ని నింపమన్నారు. గేటు దగ్గరకి వచ్చి మా వాళ్ళని కలుసుకుంటాం, మాకు రాయడం రాదు, అని చెపితే వాళ్ళు అంగీకరించలేదు, బ్రతిమాలగా ఒకర్ని వెళ్ళనిచ్చారు. రాత నెపంతో పైకి వచ్చినా, పాస్‌పోర్ట్ నెంబరు, వీసా నెంబర్లు లోపల హేండ్ బేగ్‌లో వుండిపోవడంవలన అన్నీ నింపడం అవలేదు. వెళ్ళి వస్తామని ఒకరికి ఒకరు వీడ్కోలు చెప్పుకుని అతి బలవంతం మీద లోపలికి వెళ్ళిపోయాము. స్టూడెంట్‌లా వున్న ఒక అబ్బాయికి అభినయంతో మా అవసరం వ్యక్తం చేసుకుని, రాయకుండా వుండిపోయినవి నింపించుకున్నాము. కృతజ్ఞతలు చెప్పుకుని, డబ్బులు మార్చుకునే చోటు ఎక్కడ వుందో వెతుక్కుని, వంద డాలర్ల కాగితం ఇచ్చి చిల్లరగా నోట్లు తీసుకున్నాము. 20, 10, 5లు ఇచ్చారు. అన్ని నోట్లు ఒకే సైజులో తేడా లేకుండా వున్నాయి. అక్కణ్ణించి ఏం చెయ్యాలో తెలియకపోయినా, అందరూ ఏం చేస్తున్నారో చూసుకుని, అలాగే ఇంకోవైపు వెళ్ళాము. అక్కడ మా పాస్‌పోర్ట్, వీసాలు, టిక్కట్లు చూసి మమ్మల్ని చూసి, "ఎక్కడికి వెళుతున్నారు?" అని ఇంగ్లీషులోనే అడిగారు. "శాన్‌ఫ్రాన్‌సిస్కో" అని క్లుప్తంగా చెప్పాము. తిరిగి అతను అదే పేరు అని, అక్కడికేనా వెళుతున్నారు? అన్నట్లు ప్రశ్నించారు. ఔను అన్నట్లు తల ఊపాము. టిక్కట్ల మీద, పాస్‌పోర్ట్ మీద అంగీకార ముద్రవేసి మమ్మల్ని ముందుకు వెళ్ళమని సౌంజ్ఞ చేసారు. అక్కడ మళ్ళీ హేండ్‌బేగ్‌లో ఏం తీసుకెళుతున్నారని అడిగి పంపించారు. అలా ఫస్ట్ కస్టమ్స్ క్లియరెన్స్, పాస్‌పోర్ట్ స్టేంపింగ్ ముగించి ముందుకు సాగాము.

(మరికొన్ని విషయాలు వచ్చే విజయదశమి సంచికలో ...)